ప్రజాశక్తి

మంగళవారం 07 నవంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

వాగ్వాదం చేసుకుంటున్న బిజెపి నాయకులు

బిజెపి నేతల బాహాబాహీ

పురంధేశ్వరి రాక సందర్భంగా కదిరి నేతల సిగపట్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో బిజెపి నేతల మధ్య వర్గపోరు బహిర్గం అయ్యింది. రాష్ట్ర అధ్యక్షురాలు పరందేశ్వరి రాక సందర్భంగా ఆ పార్టీ నాయకులు బాహాబాహికి దిగారు. బిజెపి బలోపేతానికి నాయకులకు దిశా నిర్దేశం చేయడానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి అన్ని జిల్లాలోనూ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం పుట్టపర్తికి విచ్చేశారు. జానకి రామయ్య కళ్యాణ మండపానికి పురంధేశ్వరి మరో 15 నిమిషాలకు చేరుకుంటున్న సమయంలో కదిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బిజెపి నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాజీ జిల్లా అధ్యక్షుడు వజ్రా భాస్కర్ రెడ్డి, ఆ పార్టీ నాయకుడు గుడిసె దేవానంద్‌లు ఇద్దరూ ఘర్షణ పడ్డారు. 'నువ్వెంత అంటే.. నువ్వెంత' అంటూ ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. ఒక సందర్భంలో ఇద్దరూ కొట్టుకునే స్థాయి వరకు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు జిఎం.శేఖర్ ఇతర ముఖ్య నాయకులు కలుగజేసుకుని గొడవను సద్దుమణిగే విధంగా చర్యలు తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అయితే నేతల మధ్య ఘర్షణ విషయాన్ని జిల్లా నేతలు ఎవరూ ఆమె వద్ద ప్రస్తావించలేదు. అనంతరం పరంధేశ్వరి బిజెపి నాయకులతో సమావేశం నిర్వహించి, దిశానిర్ధేశం చేశారు.

కరువుపై కరుణచూపేరా..?

◆ నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి రాక ◆ ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు, ప్రజలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం నాడు శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. తీవ్రమైన కరువులో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాపై ముఖ్యమంత్రి ఏమైనా కరుణ చూపుతారా అని ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు మండలాల ప్రకటన ఇటీవలనే రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇందులో కొన్ని మండలాలను మినహాయించారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్న డిమాండ్ అందరి నుంచి వస్తోంది. సత్యసాయి జిల్లాలో 31 మండలాలుంటే ఏడు తీవ్రమైన కరువు మండలాలుగానూ, 15 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించారు. తక్కిన 11 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించలేదు. వీటిని కూడా ప్రకటించాలనని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. మూడు మండలాలను మినహాయించారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి వాతావరణ పరిస్థితులూ అంతటా ఒకే రకంగా ఉన్నాయి. వర్షాలు అప్పుడప్పుడు పడినా ఆదునుదాటక రావడంతో రైతులు పంటల సాగు కూడా పూర్తి స్థాయిలో చేయలేకపోయారు. రెండు జిల్లాల పరిధిలో కలిపి మొత్తం ఎనిమిది లక్షల ఎకరాల వరకు భూమి బీడుగానే ఉంది. వర్షపాతం రిత్యా చూసుకున్నా సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 487.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 306.3 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 37.2 శాతం వర్షపాత లోటుంది. అదే సమయంలో అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 428.6 మిల్లీమీటర్లకుగానూ 267,5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ కూడా సత్యసాయి జిల్లాతో సమానంగా 37.6 మిల్లీమీర్లు వర్షపాతం లోటుంది. వర్షపాతం అక్టోబరు మాసంలో మరింత తక్కువగా పడింది. దీంతో వేసిన పంటను తొలగించడంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీ సాగు కూడా నా మాత్రంగానే ఈ ఏడాది ఉంటోంది.

ఉపాధి లేక వలసలు

తీవ్ర వర్షాభావం నేపథ్యంలో పంటలు ఏ మాత్రం చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి లేక గ్రామాల నుంచి అప్పుడే వలసలు మొదలయ్యాయి. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి, పెనుకొండ మండలాల నుంచి వలసలు అధికంగా ఉంటున్నాయి. వలసల నివారణకు చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులు ఇంకా మొదలవలేదు. ఈ ఏడాది ఉపాధి హామీ పనులు కూడా తక్కువగానే జరిగాయి. సత్యసాయి జిల్లా పరిధిలో 2.73 లక్షల జాబ్‌కార్డులుంటే 1.3 లక్షల మందికి పని కల్పించారు. అది కూడా సీజన్ ప్రారంభానికి మందే ఏప్రిల్, మే మాసాల్లోనే కల్పించారు. ఇప్పుడు పనుల్లేకపోవడంతో కర్నాటక, కేరళ రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెలుతున్నారు. పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తప్పని సాగునీటి కష్టాలు

సాగునీటి కష్టాలు ఈ ఏడాది అధికంగా ఉండనున్నాయి. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండు కాలువలకు నీటిని నిలిపేస్తున్నారు. దీంతో అనంతపురం జిల్లాలో ఈ రెండు కాలువల కింద సాగైన వరి, మిరప, పత్తి పంటలకు పూర్తిగా దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంట దిగుబడులు రావడానికి కీలకమైన సమయంలో నీరు రాకపోతే రైతులు పెద్దఎత్తున నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నీటిని అందించేందుకు ప్రభుత్వ స్థాయిలోనే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రైతులు కోరుతున్నారు.

కరువు సహాయం ప్రకటించేరా .?

తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఏమైనా సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటిస్తారా అని అనంతపురం, సత్యసాయి జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. రాబోయే తాగు,సాగునీటి కష్టాలను ఎదుర్కొనేందుకు ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది ప్రకటిస్తారా అని కూడా ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది ఇలా.?

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరుతారు. గన్నవరం విమానిశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి 10.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 10.25 గంటలకు వరకు ప్రజాప్రతినిధులను కలుసుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి ఉదయం 10.45 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు సభలోని పాల్గొని రైతుభరోసాను విడుదల చేస్తారు. ప్రసంగం, మెగా చెక్ పంపిణీ అనంతరం 12.20 గంటలకు తిరుగు ప్రయణమవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విమనాశ్రయం చేరుకుని అక్కడి నుంచి తిరిగి విజయవాడకు పయనమవుతారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పుట్టపర్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మంగళవారం నాడు పుట్టపర్తి పర్యటన సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి ఎస్పీ ఎస్‌వి.మాధవ్ రెడ్డి తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో బందోబస్తు కీలకంగా ఉండాలని అధికారులకు సూచించారు. బహిరంగ సభ స్థలం, బందోబస్తు, కాన్వాయి, ట్రాఫిక్, విఐపిల వాహనాల నిలిపే ప్రాంతాలు, సభ సమీపంలో ఉన్న వై.జంక్షన్‌లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై పోలీసు అధికారులకు సూచించారు. అంతకు మునుపు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి సమావేశం నిర్వహించారు. బందోబస్తుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాల అడిషనల్ ఎస్పీలు విష్ణు, సుధాకర్, విజయ్ భాస్కర్ రెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, కన్లక్షన్, కెవిఆర్ వరప్రసాద్, నర్సింగప్ప, విజయ నాయక్‌తో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిఐజి

సచివాలయ కార్యదర్శి నాగరాజుకి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పట్టాదారులకు ఇళ్ల స్థలాలు చూపించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్, ఇంటి పట్టా ఉన్న పేదలందరికీ స్థలాలు చూపించాలని కోరుతూ సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కార్యదర్శి నాగరాజుకి వినతి పత్రం అందజేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పాలసముద్రం గ్రామానికి చెందిన దళితులు, మైనార్టీ, బిసి కులాలకు చెందిన 25 మంది నిరుపేదలు సర్వే నంబర్-125, 127లో ఒకొక్కరు 3 సెంట్ల చొప్పున స్వాధీనం చేసుకొని గడ్డివాములు, గొర్రెల రొప్పం, పునాదులు వేసుకొని అనుభవిస్తున్నారన్నారు. అందులో 8 మందికి పట్టా ఉన్నా ఇంతవరకూ స్థలం చూపలేదన్నారు. స్వాధీన అనుభవ హక్కు పత్రాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్, తహశీల్దార్‌లకు పలుమార్లు స్పందనలో వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. స్పందించిన సచివాలయ కార్యదర్శి ఆ గ్రామ విఆర్ఒ రమేష్‌ని పిలిపించి 4 రోజుల్లో విచారణ చేసి అర్హులను గుర్తించడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, వారి ఆదేశాల మేరకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామలక్ష్మి, మంగమ్మ, రూప, నాగలక్ష్మి, నిర్మల, తిప్పమ్మ, సుకన్య, రమణమ్మ, లక్ష్మీదేవి, సుజాత, రహంతుల్లా, శాంతమ్మ, రామాంజనేయులు, లావణ్య, లక్ష్మి, రజిని, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే టిడిపి కరువుయాత్ర : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ఉనికి కోసమే టిడిపి నాయకులు కరువు పరిశీలన యాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎద్దేవా చేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ 'ప్రజా సంకల్పయాత్ర' చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ ముందుగానే నియోజకవర్గంలోని 5 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, అయితే టిడిపి నాయకులు కేవలం రాజకీయం చేయడానికి కరువు పరిశీలన యాత్ర అని చేపట్టారని మండిపడ్డారు. రైతులను ఆదుకోవడానికి వైసిపి ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఏటా రైతు భరోసా ఇస్తున్నారని, అందులో భాగంగానే మంగళవారం పుట్టపర్తిలో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తనయుడు జయరాజు, వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ చందకచర్ల రామిరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్లు విడుదల

మడకశిర : మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బిసిఆర్ దాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు 'చలో హైదరా బాద్ మాదిగల విశ్వరూప మహాసభ' కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి వెళ్లాలని కోరారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు, వైసిపి 17వ వార్డ్ కౌన్సిలర్ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ సి.నారాయణ, మైనార్టీ నాయకుడు నిస్సార్ అహ్మద్, శ్రీరామ్, ఈశ్వర్, కొల్లేష్, శివ, తదితరులు తెలిపారు.

మహిళా రిజర్వేషన్ల బిల్లులో బిసి మహిళలకు అన్యాయం

పుట్టపర్తి క్రైమ్ : మహిళా రిజర్వేషన్ బిల్లులో కేంద్ర ప్రభుత్వం ఒబిసి మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల శంకర్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు బిసిసంక్షేమ సంఘం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒ కొండయ్యకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకున్న బిల్లు ద్వారా దేశంలోనే అత్యధిక జనాభా గల ఒబిసి మహిళలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. చట్టసభలలో ఒబిసిలకు జనాభా ప్రాతిపదికన రాజ్యాంగ సవరణ బిల్లులు తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ యాదవ్, నాయకులు ఈడిగ నీళ్ల రమణ, పల్లపు జయచంద్ర, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కెవిపిఎస్ నిరసన

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు, కొర్లకుంట గ్రామ దళితులు, పేదల భూములను అన్యాక్రాంతం చేయడా న్ని ఖండిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం సోమవారం కూడా కొనసాగింది. నాయకులు మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు, దళితుల పట్ల పాలక పక్షాలు, అధికారులు, ప్రస్తుత తహశీల్దార్ వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఆరు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నా స్పందించకపోవడం దారణమన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపేదలు, దళితులకు న్యాయం చేయడంతో పాటు, తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్య దర్శి ఎంవి రమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, భూ పోరాట కమిటీ అధ్యక్షులు గోపాల్, కార్యదర్శి రాము, కొండూరు గంగాధరప్ప, నరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన కెవిపిఎస్ నాయులు

వైసిపి పాలనలో వ్యవసాయరంగం నిర్వీర్యం

టిడిపి కరువు పరిశీలన బృందం

ప్రజాశక్తి-మడకశిర, రొద్దం

వైసిపి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని టిడిపి కరువు పరిశీలన బృందం సభ్యులు మాజీ మంత్రి చంద్రమోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో కరువు పరిశీలన బందం సోమవారం మండల పరిధిలోని బేగార్లపల్లి, కదిరేపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించి ఎండిపోయిన వేరుశనగ పంటను పరిశీలించారు. నియోజకవర్గంలో వేరుశనగ పంట సాగు, నష్టపోయిన వివరాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి బృందానికి వివరించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా సాగుచేసిన వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయారని, రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని, నష్టపోయిన వరి, పూల తోటల రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోయిన టమోటా రైతులను ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా అందించాలని కోరారు. చంద్రబాబు హయాంలో కరువు సంభ విస్తే రైతులను అన్ని రంగాల్లో ఆదుకొని పంట నష్టపరిహారం, పంటల బీమా అందించామన్నారు. పర్యటనలో జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథ్‌రెడ్డి, గుండుమల తిప్పేస్వామి, పార్టీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి, జడ్పిటిసి ఉమేష్, మల్లికార్జున, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, మద్దనకుంటప్ప, గణేష్, రామిరెడ్డి, కృష్ణమూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్.గురుమూర్తి, ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రొద్దం : టిడిపి కరువు పరిశీలన బృందం జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి ఆధ్వర్యంలో మండల పరిధిలోని శేషాపురంలో పర్యటించి రైతు పొలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతో దాదాపు 40, 50 బోర్లు కాలిపోయాయన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. పార్థసారథి మాట్లాడుతూ జిల్లాకు కరువులు కొత్త కాదని, అయితే గత 25 ఏళ్లలో లేనటువంటి కరువు ఈ సంవత్సరం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, కాలవ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, నిమ్మల కిష్టప్ప, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సవిత, మండల నాయకులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నం, టిడిపి అధికార ప్రతినిధి నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం మండలంలో ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న టిడిపి కరువు పరిశీలన బృందం సభ్యులు

టిడిపి నాయకుల ముందస్తు అరెస్టు

మడకశిర : సిఎం జగన్ పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో సోమవారం మడకశిరలో టిడిపి కరువు పరిశీలన బృందం సభ్యులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పల్లె రఘునాథ్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు కరువు పరిశీలన పర్యటన ముగించుకొని తిరిగి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు మాట్లాడుతూ తాము పుట్టపర్తి వెళ్లడం లేదని ఇంటికి వెళ్తున్నామన్నారు. దీనిపై పోలీసులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సహకరించాలని కోరగా కాలవ, పల్లె, గుండుమల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసులు పల్లె, కాలవను స్టేషన్‌కు తరలించారు.

మడకశిర పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డుపై పడుకొని నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్ ఎదుట రహదారిపై పడుకుని నిరసన

నాయకుల అరెస్టును నిరసిస్తూ కాలవ, పల్లె, బికె పార్థసారథి, గుండుమల తిప్పేస్వామి, ఉమామహేశ్వరనాయుడు, మండల కన్వీనర్లు సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై పడుకొని పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ రైతుల సమస్యల పోరాడుతుంటే సిఎం జగన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయించడం భావ్యం కాదన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి-రొద్దం

ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సానిపల్లి పాఠశాలలో సోమవారం జిల్లా కార్యదర్శి అధ్యక్షతన యుటిఎఫ్ మండలం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నారాయణస్వామి మాట్లాడు తూ సిఎం జగన్ ప్రతిపక్షనేతగా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క మేలు కూడా చేయలేద న్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వారికే మొత్తం ఉపాధ్యాయ కుటుంబాల ఓట్లు వేస్తామని తెలిపారు. యుటిఎఫ్ మండల గౌరవధ్యక్షులుగా టి.రమేష్, అధ్యక్షులుగా సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కె.మారు తి, సహాధ్యక్షులుగా నాగార్జునరెడ్డి, ఎం.ముత్యాలప్ప, కోశాధికారిగా కె.శేషాద్రి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఆర్. చిన్నవెంకటేష్, సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా గౌరమ్మ, అధ్యక్షురాలిగా ఈ.హేమలత, ప్రధాన కార్యదర్శిగా పి.దేవి, సహాధ్యక్షురాళ్లుగా ఎస్.రత్నమ్మ, యు.వరలక్ష్మి, కోశాధికారిగా కె.విద్యాజ్యోతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పిఎన్.రాధిక, సభ్యులను ఎన్నుకొన్నారు.

సామాజిక బస్సుయాత్ర కాదు.. భజనయాత్ర

పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపిది సామాజిక బస్సుయాత్ర కాదు.. భజన యాత్ర అని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఎద్దేవా చేశారు. స్థానిక ఎర్రగుంట వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో సోమవారం శ్రీరామ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు చేపట్టిన బస్సు తుస్సు యాత్రగా మారిందన్నారు. ఆ యాత్రలో సీఎం జగన్‌కు భజన చేశారే కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఏం చేశారో చెప్పలేదన్నారు. అన్ని వర్గాలకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నారు. అయితే వారికి కుర్చీలు కూడా లేనిపదవులు ఇచ్చినందుకు వైసీపీ నేతలే బాధపడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో కులాల వారీగా కార్పొరేషన్లకు రుణాలు, పనిముట్లు ఇతర సాయం అందించామన్నారు. కేతిరెడ్డి సామాజిక న్యాయం లాంటి పెద్దపెద్ద డైలాగులు చెప్పడం కాదు, నియోజకవర్గంలో ఏ కులానికి ఏం న్యాయం చేశారన్నది చెప్పాలని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను హింసిస్తూ వారి ఆశలు, ఆస్తుల కూల్చివేతలు మీద అక్రమ ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఎస్సీల బోర్లు పూడ్చిప్పుడు, తాడిమర్రిలో ఇళ్లు కూల్చినప్పుడు, భూములు కాజేసినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మాంగళ్య షోరూం లాంటి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రచారంపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలపై చూపాలన్నారు. సమావేశంలో కమతం కాటమయ్య, ఫణికుమార్, పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, నాగూర్‌ఉస్సేన్, ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, రవూఫ్, విజయ్ చౌదరి పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్, నాయకులు

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

కొత్తచెరువు : ఈనెల 11వ తేదీ హైదరాబాదులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి కళ్యాణ్, గౌరవాధ్యక్షులు బండ్లపల్లి నరసింహులు యువసేన జిల్లా అధ్యక్షులు సిద్దు తదితరులు కొత్తచెరువులోని అంబేద్కర్ సర్కిల్‌లో విశ్వరూప మహాసభ పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇన్‌ఛార్జి భూతప్ప, రామాంజనేయులు, గంగప్ప, గంగన్న, వెంకటేశు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ

కొత్తచెరువు : కొత్తచెరువులోని శ్రీ చైతన్య పాఠశాలలో నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంట్రాక్ట్ ప్రాజెక్టులో పాల్గొంటున్న విద్యార్థులకు నాసా కిట్లను సోమవారం సత్యసాయి జిల్లా సైన్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి వెంకటరమణ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని మరిన్ని ప్రయోగాలు చేసి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్ కుమార్ రెడ్డి, డీన్ హనుమంతు, అనిల్ కుమార్, ఏవో కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

బడాసుబ్బిరెడ్డి

శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకునేలా సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాలో 11 మండలాలు లేకపోవడం బాధాకరం అన్నారు. పంటలు నష్టపోయిన నేపథ్యంలో రైతుల అన్ని రకాల అప్పులనూ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టు రైతులకు రావాల్సిన ఇన్సెంటివ్ మొత్తం వెంటనే ఇవ్వాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై నేడు జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రామ్మోహన్, సాంబశివ, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి

I.A.NO:169/2021 in O.S.NO:620/2021

Between:

Ungarala Venkatadri and 6 others ...**Plaintiff**

And

M.Sreeramulu Naik and 11 others

...**Defendants**

To,

D1: ఎం.శ్రీనివాసులు నాయక్ S/o లాలేనాయక్, వయస్సు 44 ఏళ్లు, హిందూ, డోర్ నెం:4-32, మొగలిచెట్ల తాండా, తవళం గ్రామం, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

D3: ఎం.బాబు నాయక్ S/o లాలేనాయక్, వయస్సు 57 ఏళ్లు, హిందూ, డోర్ నెం:4-32-బి, మొగలిచెట్ల తాండా, తవళం గ్రామం, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

1 మరియు 3వ ప్రతివాదులకు కోర్టు నోటీసులు

పైన తెలిపిన వాదులు మీపై ఇంజెంక్షన్ దావా వేసి ఉన్నారు. ఈ దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చడమైనది. మీ హాజరు నిమిత్తం పై కోర్టులో 29/11/2023 వ తేదిన వాయిదా ఉన్నది. ఆ రోజు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు పై వారి కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:29/11/2023

స్థలం:కదిరి

కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ., బి.ఎల్,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440361798

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి

O.S.NO:10/2023

Between:

గండారెడ్డి నిర్మలమ్మ W/o జి.రాజారెడ్డి D/o పొట్టా వెంకట సుబ్బారెడ్డి (Late) D.No:6-24 ఆకులవారిపల్లి గ్రామం, H/o చినగానిపల్లి అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

పొట్టా రామకృష్ణమ్మ W/o పొట్టా నరసింహారెడ్డి మరియు 12 మంది ఇతరులు ...ప్రతివాదులు

1.పొట్టా పార్వతమ్మ W/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

2.పొట్టా హారిక D/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

3.పొట్టా పృధ్వీ గోకుల్ రెడ్డి S/o పొట్టా శివశంకరరెడ్డి లేట్ ఎ.కొత్తపల్లి గ్రామం, అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

4.పొట్టా సుగుణమ్మ D/o పొట్టా వెంకటసుబ్బారెడ్డి లేట్ W/o జనార్ధన్ రెడ్డి, చినగానిపల్లి , అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా.

5.మిఠాయి బషీర్ సాహెబ్ S/o భాషా సాహెబ్ D.No:1-A 1st Ward బస్టాండ్ దగ్గర అమడగూరు మండలం (పోస్టు), శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాదులు **6,7,8,9,13**

6,7,8,9,13వ ప్రతివాదులకు నోటీసు

ఇందుమూలంగా 6 నుండి 9 మరియు 13వ ప్రతివాదులకు తెలియజేయడము ఏమనగా పై కేసు మీ హాజరు నిమిత్తం 27/11/2023వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు. కావున 27/11/2023న మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీకు ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని పరోక్షంలో పై దావాలో మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27/11/2023

స్థలం:కదిరి

తూముకుంట.బాబాజాన్, ఎమ్.ఎ., బి.ఎల్,
యాకాసి వీరాజు, ఎమ్.ఎల్,
వాదితరుపు న్యాయవాదులు, కదిరి.

కదిరిలో బాబాయ్..అబ్బాయ్..!

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న 'బత్తల', తదితరులు

ప్రజల్లోకి వెళ్తున్న బత్తల వెంకటరమణ, బత్తల హరిప్రసాద్
నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యేలా కార్యక్రమాలు
వైసిపి అధిష్టానం ఆశీర్వాదం ఉందంటున్న 'బత్తల' కుటుంబం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయంగా కదిరి నియోజకవర్గంలో పెద్దఎత్తున మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అధికార వైసిపి పార్టీలో ఆ రకమైన పరిణాలు ఎక్కువగా ఉంటున్నాయి. కదిరి వైసిపి టికెట్టు కోసం పదుల సంఖ్యలో అభ్యర్థులు అధిష్టానం దృష్టిలో పడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్టు విషయంపై అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి సంకేతాలు ఇవ్వనట్లు తెలుస్తోంది. కదిరి టిడిపి అభ్యర్థిగా ఇప్పటికే ఆపార్టీ కందికుంట వెంకటప్రసాద్‌ను బరిలోకి దింపుతున్నట్లు సంకేతాలు ఇచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన్ను ఎదుర్కొనే బలమైన అభ్యర్థి వేటలో వైసిపి పలు సర్వేలు చేయిస్తోంది. ఇందులో భాగంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన బత్తల కుటుంబం పేరు కూడా ప్రముఖంగా విన్పిస్తోంది. ఈ కుటుంబానికి టికెట్టు కేటాయిస్తే టిడిపిని ఢీకొనవచ్చు అనే చర్చ వైసిపి వర్గాల్లో నడుస్తోంది. బత్తల వెంకటరమణ, బత్తల హరిప్రసాద్‌లు గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల మధ్యనే ఉంటూ వారి రాజకీయ ప్రయాణాన్ని సాగిస్తున్నారు. వారికి మద్దతుగా నిలిచే ప్రతి ఒక్కరినీ కలుపుకుని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు, ఆర్థిక సాయం అందిస్తూ ప్రజల మధ్యన నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కి అన్ని విధాలా అండగా ఉంటానని బాబాయ్ బత్తల వెంకటరమణ ఇప్పటికే ప్రకటించారు. బత్తల వెంకటరమణ వైసిపి పెద్దలతో నిత్యం కలుస్తున్నారు. అటు రాజకీయంగానూ, ఇటు కదిరి నియోజకవర్గ అభివృద్ధిపైనా పార్టీ పెద్దలతో మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే, లేదా ఎంపీ రెండింటిలో ఏ ఒక్కటి అవకాశం ఇచ్చినా గెలిచి జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని బత్తల కుటుంబ సభ్యులు ధీమాగా చెబుతున్నారు. హిందూపురంలో మైనార్టీలకు వైసిపి టికెట్టు కేటాయిస్తే కదిరిలో బీసీలకు ఇస్తారన్న ప్రచారం కూడా ఆపార్టీ వర్గాల్లో విన్పిస్తోంది. బీసీలకు కదిరి కేటాయిస్తే బత్తల హరిప్రసాద్‌కు టికెట్టు వస్తుందని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంతవరకు వడ్డెర సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వలేదని, ఈ నేపథ్యంలో రాజకీయంగా బలంగా ఉన్న బత్తల కుటుంబానికి టికెట్టు ఇచ్చి చట్టసభల్లోకి పంపాలనే వాదన కూడా ఆ కులసంఘాల నేతల నుంచి విన్పిస్తోంది. ఈ మధ్యకాలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి తదితరులను సైతం బత్తల కుటుంబం కలిసి టికెట్టు విషయంపై మాట్లాడారు. పార్టీ పెద్దలు కూడా జనం మధ్యలో ఉండాలని... తమ ఆశీర్వాదాలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. బత్తల కుటుంబం ఇప్పటికే కదిరి నియోజకవర్గం వ్యాప్తంగా పర్యటించి వారి మద్దతుదారులతో సమావేశాలూ నిర్వహించారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఆర్థిక సాయం కూడా అందించారు. కదిరి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, ఇక్కడ వారికి స్థానికంగా ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఉన్నట్లు బత్తల హరిప్రసాద్ వారి మద్దతుదారుల వద్ద చెబుతున్నారు. బత్తల హరిప్రసాద్ ఇటీవల పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహాయసహకారాలు అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అధిష్టానం 'బత్తల' కుటుంబానికి ఎలాంటి రాజకీయ ప్రోత్సాహం అందిస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

బత్తల హరిప్రసాద్

ఇళ్లపట్టాలివ్వమంటే ఉన్న గుడిసెలకు నిప్పు పెడతారా..?

గుడిసెలకు నిప్పు పెట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- చిలమత్తూరు

ప్రభుత్వం అర్హులకు 4 ఏళ్లుగా ఇళ్లపట్టాలు ఇవ్వక పోవడంతో జగనన్న లే అవుట్‌లో పేదలు వేసుకున్న గుడిసెలకు నిప్పుపెట్టి పైశాచిక ఆనందం పొందడం దారుణమని ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదలు సర్వేనెంబర్ 805 లో వేసుకున్న గుడిసెలను తహశీల్దార్ ఆదేశాల మేరకు జెసిబిలతో తొగిలించి ఆ తర్వాత వాటిని నిప్పు పెట్టిన నేపథ్యంలో నాయకులు సోమవారం ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు ఒపిడిఆర్ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా నాయకులు సిద్దారెడ్డి, కార్మిక సంఘం నాయకులు రవి, జమల్ తదితరులు మాట్లాడుతూ తహశీల్దార్ తీరును తప్పుపట్టారు. ఒక వేళ ప్రభుత్వభూమిలో పేదలు గుడిసెలు వేసుకున్నారంటే తీసెయ్యమని కోరుతూ ముందస్తు నోటీసులు ఇవ్వాలన్నారు. చట్ట ప్రకారం వారు తీసెయ్యకపోతే రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయబద్ధంగా అర్హులుగా ప్రభుత్వం గుర్తించిన పేదలే ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో గుడిసెలు వేసుకుంటే ఇంత పైశాచికంగా ప్రవర్తించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. పేదలు గుడిసెలు వేసుకున్న 805 సర్వే నెంబర్ జగనన్న లేఅవుట్ లోనే పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, రామచంద్ర, లక్ష్మి నారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు చందు, సాదాశివరెడ్డి, రహమతుల్లా, నరసింహ, మణి స్వామి, వేణు రాయల్, నాగరాజు, యస్మిన్ తాజ్, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటు పరం చేయరాదని, కడపలోనే ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు కోరారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ మంజుల నరేంద్ర తోపాటు పదిమంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భార్గవ్, చైతన్య, ఇలియాజ్, ఆది, దుర్గా, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీ కరణచేయడానికి విరమించుకోవాలన్న డిమాండ్‌తో 8న వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థిసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం సప్తగిరి కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎన్ఎస్‌యుఐ జాతీయ సమన్వయకర్త సంపత్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు జయచంద్ర, నరసింహమూర్తి, తరుణ్, దేవరాజు, రాజా, దినేష్ రెడ్డి, వినీత్, మహేష్, సాయి, శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం , ఆర్టీసీ బస్సు ఢీ.. దంపతులు మృతి

ప్రజాశక్తి బుక్కపట్నం

మృతులు రామాంజినేయులు, అనిత (ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో గ్రామానికి చెందిన దంపతులు మృతి చెందారు. మృతుని బంధువులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన దంపతులు రామాంజనేయులు (37), అనిత (27) బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంలో పాముదుర్తి నుంచి బేల్దారు పని నిమిత్తం ముదిగుబ్బకు బయలుదేరారు. అదే సమయంలో ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వచ్చే ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా వచ్చి గ్రామ సమీపంలోని మలుపు వద్ద వీరు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులు బస్సు ముందు చక్రం కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ గంగప్ప పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కరువు మండలాల జాబితాలో రామగిరి, సీకేపల్లి మండలాలు లేకపోవడం అన్యాయమని వెంటనే ఆ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అధికారి హంపయ్యకు సోమవారం అందజేశారు. జిల్లాలో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దారుణమన్నారు. రామగిరి, సీకేపల్లి మండలాల్లో తీవ్ర వర్షాభావంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. సరైన వర్షాలు లేక భూగర్భజలాలు కూడా అడుగంటి పోయాయని రైతుల పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఉందని, ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు మారుతి, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. బాషా, ఎల్. ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏం చేశారని సిఎం జిల్లా పర్యటన : పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏ మొహం పెట్టుకొని పుట్టపర్తికి వస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం టిడిపి స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లాకు ఏం చేశారని పుట్టపర్తి పర్యటనకు వస్తున్నారన్నారు. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చి మాట తప్పినందుకా? సత్యసాయి తాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేసినందుకా? నియోజకవర్గంలోని 193 చెరువులో నింపుతామని రైతులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి నందుకా? అని పల్లె నిలదీశారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి ఏ మొహం పెట్టుకొని పుట్టపర్తి పర్యటనకు వస్తారని అన్నారు. సత్యసాయి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంచినీటి పథకాన్ని నాశనం చేసి నేడు ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితికి తెచ్చారన్నారు. పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి రాగానే 193 చెరువుల నింపుతామని నల్లమాడ బహిరంగ సభలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అయినా చెరువులను నింప లేకపోయారని విమర్శించారు. కప్పలబండలో పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి సమీకరించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పరిశ్రమలు తీసుకురాలేదన్నారు. తీవ్ర కరువుతో రైతులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించలేదన్నారు. నూతనంగా పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి ఇంతవరకు కనీస మౌలిక సదుపాయాలు, కార్యాలయాలకు భవనాలు నిర్మించలేదన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలను కలుపుతూ నాలుగు లైన్ల రింగు రోడ్డుని ప్రకటించి నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక తట్టెడు మట్టి కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా నిధులు మంజూరు చేస్తూ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇందులో ఈ ప్రభుత్వ ఘనత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ధర్నాలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

వైసీపీ నాయకులు ప్రజాప్రతినిధులు చెప్పిన విధంగానే బిఎల్వోలు కొంతమంది సంబంధిత అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్ బాబు, చెన్నకేశవులు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కదిరి నియోజవర్గ వ్యాప్తంగా మరణించిన వారి పేర్లను, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి పేర్లను, రెండు చోట్ల ఉన్న వారి పేర్లను సమర్పించిన కూడా అధికారులు వాటిని తొలగించకుండా వైసిపి నాయకులు చెప్పినట్లు చేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఇచ్చిన ఓటరు జాబితా నివేదికపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

శ్రీ చైతన్య పాఠశాలలో
పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు
నోటీసు జారీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

. పెచ్చులూడిన పాఠశాల గదిని పరిశీలిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలో పదవ తరగతి గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడి ఐదుగురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. సోమవారం జరిగిన ఈ సంఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు స్పందించి చైతన్య పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. విద్యార్థులు కనీస సౌకర్యాలు, రక్షణ లేకుండా పాఠశాల నడుపుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కట్టే ఫీజుల పైన ఉన్న ధ్యాస విద్యార్థుల పైన లేదని విమర్శించారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పాఠశాలకు నోటీసు జారీ చేశారు. ఇదే ఎంఇఒ ఇదే పాఠశాలకు ఎన్నో సార్లు నోటీసులు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు చర్యలు మాత్రం చేపట్ట లేదు. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ బాబావలి, ఎన్ఎస్‌యుఐ సంపత్ కుమార్, ఎఐఎస్ఎఫ్ చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎస్ఎఫ్ నాగభూషణ, టిఎన్ఎస్ఎఫ్ అభి, ఇతర నాయకులు రవి, జయచంద్ర, మోమిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న బొలెరో

లేపాక్షి : మండల పరిధిలోని గలిబిపల్లి క్రాస్ వద్ద సోమవారం హిందూపురం వైపు నుంచి వస్తున్న బొలెరో లేపాక్షి వైపు నుంచి వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. బొలెరో డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టిప్పర్ డ్రైవర్ కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న కంకుల మాటున గోమాంసం తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని, గోమాంసాన్ని గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గోతిలో పుడ్చినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్‌కార్డుదారుల ఆందోళన

గుడిబండ : ఎండియు ట్రక్కు ఆపరేటర్లు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని సోమవారం మండల పరిధిలోని హిరేతుర్పి గ్రామంలో కార్డుదారులు ఆందోళన చేపట్టారు. మహిళలు మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లు, షాపు డీలర్ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రతి నెలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇకనైనా ఉన్నాతాధికారులు స్పందించి కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

పెనుకొండ : భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ దర్బార్‌వలికి వినతి పత్రం సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్, నాయకులు గంగాధర్ మాట్లాడు తూ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో రామాంజనమ్మ, కదిరమ్మలకు 2008లో ఇంటి పట్టా ఇచ్చి ఇళ్లు మంజూరు చేయగా ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లు నిర్మించలేకపోయారన్నారు. వారి ప్లాట్లను కొందరు ఆక్రమించుకొని దౌర్జన్యంగా పునాదులు వేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నిరుపేదలకు ఇచ్చిన స్థలం వారికి ఇప్పించాలని, ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రాజేష్‌కి ఫిర్యాదు చేశామన్నారు. వినతి ఇచ్చిన వారిలో తిప్పన్న, కదిరమ్మ, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోనిఎన్జీవో కాలనీ వార్డు సచివాలయం పరిధిలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదవారి పాలిట వరమన్నారు. ప్రతి పేదవారికి మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసా సాదిక్‌తో పాటు వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపిపి, జెడ్పీటీసీతో పాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కంటిపరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొత్త ట్రిబ్యునల్‌ను రద్దు చేయాలి

చిలమత్తూరు : కృష్ణా జలాల పున:పంపిణీ పై కేంద్రం వేసిన కొత్త ట్రిబునల్ ను రద్దు చేయాలని జలసాధన కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి సోమవారం కొడికొండ చెక్‌పోస్టు వద్ద అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ట్రిబునల్ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ ట్రిబునల్ అమలు చేస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జలసాధన కమిటీ నాయకులు శ్రీనివాసులు, సిద్దారెడ్డి, రవికుమార్, జమల్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం కాన్వాయ్ రిహార్సల్స్ పరిశీలన

పుట్టపర్తి రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 7న పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో సిఎం కాన్వాయ్ రిహార్సల్స్‌ను ఎస్పీ మాధవరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సెక్టర్ ఇన్‌ఛార్జి అధికారులకు బ్రీఫింగ్ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు.. పోలీసులు అప్రమత్తంగా ఉండి, పకడ్బందీ భద్రతతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్య సాయి, చిత్తూరు జిల్లాలకు చెందిన అడిషనల్ ఎస్పీలు విష్ణు , సుధాకర్, విజయ్ భాస్కర్ రెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, హుస్సేన్‌పీరా, కన్జక్షన్, కెవిఆర్ వరప్రసాద్, నర్సింగప్ప, విజయనాయక్, ఎస్‌బిఐ రవీంద్రారెడ్డి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

బుక్కపట్నం : జిల్లాలోని అతి పెద్ద చెరువైన బుక్కపట్నం చెరువు ముంపునకు గురవుతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల కేంద్రంలో చెరువు ముంపునకు గురవుతున్న జానకంపల్లి, పెద్ద కమ్మవారి పల్లి, బుక్కపట్నం రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ముంపు రైతులను అన్ని విధాలుగా ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రైతుల భూములు చెరువులో ఉన్నందువలన పంటలు పండించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనాన్రు. ఇప్పటికైనా రైతు సమస్యలను పరిష్కరించి రైతులకు నష్టపరిహారం చెల్లించిన విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, నాయకులు సయ్యద్‌బాషా, వలిపి శ్రీనివాసులు, మాజీ ఎంపిటీసీ జయరాం, టిఎన్ఎస్ఎఫ్ శ్రీనివాసులు, గొర్లకృష్ణ, రవీంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మంత్రులు ఆత్మపరిశీలన చేసుకోవాలి : కందికుంట

ప్రజాశక్తి కదిరి అర్బన్

సామాజిక సాధికారత బస్సు యాత్ర పేరుతో బడుగు బలహీన వర్గాలకి పెద్ద పీట వేశామని ప్రగల్భాలు పలుకుతున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై విమర్శించారు. వైసిపి పాలకులు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిని మరిచి రాక్షస పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న రామచంద్రారెడ్డి ఈ జిల్లాలపై సవతిప్రేమ చూపుతున్నారన్నారు. ఈ ప్రాంత రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా స్వలాభం కోసం కేవలం పుంగనూరు మంత్రిగా ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. పుంగనూరుకు చెర్లోపల్లి రిజర్వాయర్ నీటిని తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కదిరి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యవసాయ నీటిని, మున్సిపాలిటీలో తాగు నీరు అవసరాలు తీర్చడం కోసం ఆరోజున చంద్రబాబు నాయుడు నీటిని కేటాయిస్తే నేడు నీటి లభ్యత కూడా లేకుండా చేసి స్టోరేజ్ చేయకుండా తన ప్రాంతానికి అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు. ఈ నిర్ణయంతో ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు సిగ్గు తో తలవంచుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పదవి వ్యామోహాలను పక్కనపెట్టి మంత్రులను ప్రశ్నించి జలవనరులను కాపాడాలని కందికుంట సూచించారు.

సెల్ టవర్ నిర్మించరాదని వినతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెర్వేపల్లి వంకగడ్డ వీధిలో సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టరాదని కాలనీవాసులు తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 20 కుటుంబాలు ఉన్న తమకాలనీలో నివాసముండే బేతపల్లి పగ్గం నారాయణ ఖాళీ స్థలంలో జియో సెల్ టవర్ నిర్మించేందుకు కంపెనీవారు నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకున్నామన్నారు. అయితే కౌన్సిలర్ కుమారుడు నాగేంద్రబాబు, పగ్గం నారాయణ కుమారులు ప్రకాష్, రఘు తమను బెదిరిస్తున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

పశువుల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు

గాండ్లపెంట : పశువుల పెంపకం దారులకు రాష్ట్ర ప్రభుత్వం పశువర్ధ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని పశువైద్యాధికారి బి. చెన్నకేశవ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశు పోషణకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేస్తుందన్నారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల పెంపకానికి 50 లక్షల రూపాయలు, నూరు గొర్రెలు, ఐదు పొట్టేళ్లకు పది లక్షల రూపాయలు, పెరటి కోళ్లకు పెంపకానికి వెయ్యికోళ్లు, వంద పుంజులు పెంపకానికి 25 లక్షల రూపాయలు, పందులు పెంపకానికి వంద ఆడ, 10 మగ పందులకు 30 లక్షల రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు వివరాలకు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన చెప్పారు.

ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు: ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికీ ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్దా రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2017 నవంబర్ 6వ తేదీ నాడు ఇడుపులపాయ నుండి తన ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించి 3648 కిలోమీటర్ల మేర ఇచ్చాపురం వరకు నడిచి నేటికి ఆరు సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. ఆయన నడిచిన ప్రతి అడుగులోనూ లక్షల మంది వెంట ఉన్నారన్నారు. ప్రజల సమస్యలు వినడమే కాకుండా ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టే కార్యక్రమాలను పాదయాత్రలోనే రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 2019వ సంవత్సరంలో జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశంలో ఎక్కడ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా, వైసిపి నాయకులు సాదిక్‌బాషా, సాయి ప్రణీత్ రెడ్డి, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

'భూ కబ్జాలకు పాల్పడలేదు'

కదిరి అర్బన్ : తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం తనకు, తన కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని సాయి దేవానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ లేనిపోని ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేయడం రాజకీయ దురుద్దేశంతోనే జరుగుతున్నాయన్నారు. గతంలో పృష్ణా అనే ఆమె ఇద్దరం కలిసి భూమి కొనుగోలు చేశామన్నారు వ్యాపార నిమిత్తం కొని రికార్డు పరంగానే తీసుకున్నామని చెప్పారు. 3.50 ఎరాల భూమిని నగదు చెల్లించి కొనుగోలు చేశామన్నారు. ఇలాంటి బెదిరింపులకు ఎన్నడూ భయపడమని ప్రస్తుతం భూమి విషయం న్యాయస్థానంలో ఉందని చెప్పారు. వాటిపైన ఎలాంటి ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు మానుకొని ప్రజల పక్షాన నిలబడి ప్రజలకు సేవ చేసే రాజకీయ నాయకులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. తాను కాని, తన తండ్రి కాని ఎలాంటి భూ కబ్జాలకు పాల్పడలేదని అన్నారు.

వైద్యులకు సన్మానం

తలుపుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ వైద్యులు సల్మామున్వర్ బాషాను ఘనంగా సన్మానించారు. వైద్యులు సల్మా, మున్వర్‌బాషా ఎమ్మెస్ సర్జన్ గైనకాలజీ ఉన్నత విద్యకు వెళ్తున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి జిల్లాలోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం నాయకుడు పై పల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 11 మండలాలను మాత్రమే కరువు జిల్లాలుగా ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. ఈ ఏడాది జిల్లాలోని అన్ని మండలాల రైతులు ఖరీఫ్ సీజన్లో పెట్టిన పంట పూర్తిగా కోల్పోయారన్నారు. వెంటనే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను జిల్లాలోని మంత్రులు ప్రజాప్రతినిధులు పుట్టపర్తికి వస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తేవాలని కోరారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చదువుకు పేదరికం అడ్డు రాకూడదని భావించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. పట్టణంలోని ఏడవ వార్డుకు చెందిన నీలూరి గౌతమి ప్రస్తుతం బీటెక్ మూడవ సంవత్సరం సిఎస్‌సి గ్రూప్ చదువుతోంది. ఇటీవల గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా గౌతమి ఎమ్మెల్యేను కలిసి తన చదువుకు అవసరమైన లాప్టాప్‌ను ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన నివాసానికి పిలిపించి గౌతమికి తల్లిదండ్రుల సమక్షంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. ఈసందర్భంగా గౌతమి, ఆమె తల్లిదండ్రులు ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

పాఠశాలలకు సెలవు ప్రకటించడం అన్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్నా ప్రవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతు గతంలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నారు అంటే ఆ పార్టీ నాయకులు, అధికారులు భయపడే వారన్నారు. అయితే ఇప్పుడు పాఠశాల విద్యార్థులు సైతం భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి ఏజిల్లా పర్యటనకు వెళితే ఆ జిల్లాలో ప్రవేటు పాఠశాలలకు సెలవు అన్నట్లు అర్థం అవుతోందన్నారు. ముఖ్యమంత్రితో పాటు అధికార పార్టీ నేతల నుంచి మెప్పు పొందడానికి ప్రవేటు పాఠశాలలకు సెలవులను ఇచ్చి, ఆయా పాఠశాలల బస్సులను జనాలను తరలించడానికి వినియోగించుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటాపురం అభి, అభిషేక్, అమన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులు

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం పక్కను ఉన్న ఇసుక రీచ్‌ను స్థానిక ప్రజాసంఘాల నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ, సిపిఐ కార్యదర్శి చింతా పురుషోత్తం, జైభీమ్ భారత్ పార్టీ నాయకులు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారన్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందన్నారు. పెన్నానదిలో ఇసుక తరలించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఇసుక తరలించడం వల్ల ఏర్పడిన గోతుల్లో ప్రజలు, పిల్లలు పడి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుకరీచ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర ఘటనా స్థలానికి వెళ్లిఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఉపాధ్యాయిని మృతి

గుత్తి : అనారోగ్యంతో బాధపడుతూ ఉపాధ్యాయిని మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి గుత్తిలోని కోట ప్రాంతంలో చోటుచేసుకుంది. మండలంలోని కొజ్జేపల్లి పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించే కష్టవేణి ఇటీవల కామెర్ల వ్యాధికి బారిన పడ్డారు. కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామంలో సోమవారం అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజా పంపిణీ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో పట్టుకున్నారు. గ్రామంలోని ఓ రేకులషెడ్డులో అక్రమంగా ఉంచిన 60 బస్తాల స్టోర్ బియ్యాన్ని టీం సభ్యులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ తెలిపారు.

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని చాలివేముల గ్రామంలో శివశంకర్‌రెడ్డి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆశివశంకర్‌రెడ్డి మద్యం అమ్ముతున్నట్లు తెలుసుకుని దాడి చేసి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో అధికారులతో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సమీక్షించారు. సోమవారం సభ వేదిక ప్రాంతంలో జిల్లా అధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అందరూ పరస్పర సహకారాలతో అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. వై జంక్షన్ లో రైతు భరోసా, పిఎం కిసాన్ పథకం ద్వారా ముఖ్యమంత్రి నిధులు విడుదల చేస్తారన్నారు. బహిరంగ సభకు తరలివచ్చే రైతులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులు, తదితరులకు కల్పిస్తున్న వసతులపై కలెక్టర్ అడిగి తెలుసుకొని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రైతుల ప్రయాణ సౌకర్యం, సభా వేదిక నిర్మాణం, అలంకరణ ఏర్పాట్లు, సభలో కూర్చోవడానికి అవసరమైన చర్యలు, విద్యుత్ సరఫరా, పోలీస్ భద్రత చర్యలు, తాగునీటి వసతి, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, విఐపి, మీడియా గ్యాలరీ ఏర్పాట్లు, విమానాశ్రయం నుంచి సభా వేదిక వరకు చేపట్టిన ఏర్పాట్లు, వైద్య శిబిరాల ఏర్పాట్లు, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ సేవలు, సభకు ప్రవేశ పాసులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై కలెక్టర్ పరిశీలించి ఇంకా పూర్తికాని పనులు రాత్రికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.